సాక్షి మహబూబాబాద్

సోమవారం । 2 । జనవరి । 2023



'కాళేశ్వరం' మోటార్లు రెడీ!

కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీపంప్‌హౌస్‌లో ఆరు మోటార్లు, అన్నారం పంప్‌హౌస్‌లో నాలుగు మోటార్లు నీటిని ఎత్తిపోసేందుకు రెడీ అయ్యాయి. - 8లో▸



మృతదేహంతో రాస్తారోకో

గ్రానైట్ లారీ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన బానోత్ సుమన్ కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.7⁰ /18.4⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం నుంచే చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నూతన ఉత్సాహంతో ముందుకెళ్లాలి

- ఎస్పీ శరత్‌చంద్రపవార్



మహబూబాబాద్ రూరల్: జిల్లా ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది కొత్త సంవత్సరంలో నూతన ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎస్పీ శరత్ చంద్రపవార్ జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేడు న్యాయసేవాధికార సంస్థ విభాగం ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవనాల సముదాయం ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వర్చువల్ విధానంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ ఉదయం 9గంటలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విభాగాన్ని ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి హైకోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.నవీన్‌రావు, హైకోర్టు జడ్జి, మహబూబాబాద్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి పి.మాధవిదేవి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ ఎస్.గోవర్ధన్‌రెడ్డి పాల్గొననున్నట్లు జిల్లా కోర్టు వర్గాలు తెలిపాయి. మహబూబాబాద్ నుంచి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వసంత్, సీనియర్ సివిల్ జడ్జి సీ.సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి హాజరుకానున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు.

శౌర్య దివస్



హన్మకొండ: హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శౌర్య దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ 1818 సంవత్సరం జనవరి 1న భీంకోరేగావ్‌లో బ్రాహ్మణులు–మహర్లకు మధ్య యుద్ధం జరగ్గా.. మహర్లు విజయం సాధించారని, ఆ రోజును శౌర్య దివస్‌గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సలహాదారు రౌతు రమేష్‌కుమార్, సంఘాల నాయకులు బక్క దానయ్య, రవీందర్, బొమ్మల అంబేడ్కర్, యాదల రవీందర్, జగపతి, కొమ్ముల సురేందర్, గుమ్మడి ప్రవీణ్ కుమార్, బంగారు బాబు, రాజలింగం, ఇమ్మడి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా..



నయీంనగర్: నూతన సంవత్సరం సందర్భంగా కుడా ఆధ్వర్యంలో హనుమకొండ జైన్ గుట్ట(అగ్గలయ్య గుట్ట) వద్ద ఆదివారం నిర్వహించిన హైకింగ్, రాపెల్లింగ్, రాక్ క్లైంబింగ్ ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మౌంటేనీర్ ఎవరెస్ట్ క్లైంబర్ పి.అన్విత హాజరయ్యారు. ట్విన్ సిటీస్‌కు చెందిన 13 మంది ఔత్సాహిక యువతీయువకులు హైకింగ్, రాపెల్లింగ్, రాక్ క్లైంబింగ్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా మౌంటేనీర్ అన్విత మాట్లాడుతూ వరంగల్ నగరవాసులు సాహస క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. మెట్రో నగరాల్లో మాదిరిగా హనుమకొండలో కుడా ఆధ్వర్యంలో అత్యంత భద్రత మధ్య అడ్వెంచర్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కుడా ఈఈ భీంరావ్, పీఓ అజిత్‌రెడ్డి, సిద్ధార్థ, రాక్ క్లైంబింగ్ స్కూల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు విజయం!

- పోరాడి గెలిచిన నారాయణపురం రైతులు
- 225 మందికి పాస్‌పుస్తకాలు
- ప్రాసెస్‌లో మిగిలిన రైతుల భూములు
- ధరణితోనే సమస్య పరిష్కారమంటున్న రెవెన్యూ అధికారులు



సాక్షి, మహబూబాబాద్/కేసముద్రం: భూమినే నమ్ముకొని శతాబ్దాల నుంచి రైతులు జీవిస్తున్నారు. అయితే ఏం జరిగిందో ఏమో.. తమ భూమి రికార్డుల్లో లేకుండాపోయింది. దీంతో ప్రభుత్వపరంగా వచ్చే రైతు బంధు, బీమా, ఇతర సబ్సిడీలు చివరకు ఉత్పత్తుల అమ్మకాల్లో రాయితీలు కూడా నోచుకోలేదు. కాగా ఐదు సంవత్సరాలుగా నాయకులు ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎక్కని ఆఫీసు మెట్లు లేవు. ఇలా గ్రామం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు అందరి దృష్టికి తమ భూ సమస్యను తీసుకెళ్లారు. రైతుల పోరాటంతో అధికారులు స్పందించారు. వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తున్నారు. ఈ యాసంగి నుంచే రైతుబంధు కూడా రానుంది. ఇది జిల్లాలోని కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు విజయం. కాగా కొంతమందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు రాగా.. మిగిలిన వారివి ప్రాసెస్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా అందరికి పాస్ పుస్తకాలు వచ్చేలా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

పట్టువీడని రైతులు

భూప్రక్షాళనలో భాగంగా 2017లో నెల్లికుదురు మండలంలోని చెట్లముప్పారం రెవెన్యూ గ్రామం నుంచి నారాయణపురం వేరు చేశారు. ఆ సయయంలో కొన్ని తండాలను కలుపుకుని నారాయణపురంను రెవెన్యూ విలేజ్‌గా మార్చి కేసముద్రం మండలంలో కలిపారు. ఈ క్రమంలో పొరపాటున అధికారులు ఆ గ్రామ భూములన్నింటినీ అటవీభూముల్లో కలిపారు. కాగా అప్పటి నుంచి నేటి వరకు ఆ గ్రామ రైతులకు రైతుబంధు, రైతు బీమా, బ్యాంకు రుణాలు అందకుండాపోయాయి. ఆ తర్వాత పలుమార్లు రైతులు మండల, జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు, దీక్షలు చేశారు. సమస్యను ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ కవిత, మంత్రి సత్యవతిరాథోడ్ దృష్టికి తీసుకెళ్లారు. వీరు పలుమార్లు కలెక్టర్ శశాంకతో చర్చించారు. రైతుల సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చివరకు సమస్యకు పరిష్కారమార్గం దొరికింది.

మార్గం చూపిన ధరణి

భూ ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ నారాయణపురం గ్రామ రైతుల సమస్య తీర్చేందుకు మార్గం చూపింది. రైతులు పట్టువీడకుండా గ్రామం నుంచి సచివాలయం వరకు వెళ్లడంతో స్పందించిన సీఎం ఈ సమస్య పరిష్కరించాలని సీఎస్ సోమేశ్‌కుమార్‌కు సూచించారు. స్పందించిన ఆయన కలెక్టర్ శశాంకకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కలెక్టర్, తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. రైతుల వద్దనుంచి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తుల్లో 366 మంది రైతుల 688.05 ఎకరాల భూమిని ఆమోదయోగ్యంగా ఉందని గుర్తించారు. ఇందులో 225మంది రైతులకు 484.03 ఎకరాలకు పాస్‌పుస్తకాలు కూడా జనరేట్ చేశారు. వీరు ఈ ఏడాది యాసంగిలో రైతు బంధుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. మిగిలిన 141మందికి చెందిన 204.02ఎకరాల భూముల ప్రాసెస్ కొనసాగుతోంది. అయితే సాదాబైనామా ద్వారా దరఖాస్తులు చేసుకున్న 424మంది రైతులకు చెందిన 579ఎకరాల సమస్య ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. వీటితోపాటు మరో వెయ్యిమంది రైతుల భూ సమస్య కూడా పరిష్కరించాల్సి ఉంది.

మూకుమ్మడి విజయం



దశాబ్దాల తరబడి సాగుచేసుకుంటున్న భూమి వివరాలు రికార్డుల నుంచి మాయమయ్యాయి. దీంతో ప్రభుత్వ పథకాలు రాలేదు. తొమ్మిదిసార్లు రైతుబంధు రాకుండా పోయింది. రైతులం మూకుమ్మడిగా పోరాడాం.. విజయం సాధించాం. సహకరించిన ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

-లెక్కల రాజు, రైతు, నారాయణపురం

ఆనందంగా ఉంది..



రైతుబంధు పథకం ప్రారంభమైనప్పటి నుంచి మా భూములకు పాస్‌పుస్తకాలు, రైతుబంధు రాకుండా ఆగింది. నాకున్న 2.10ఎకరాలకు గాను ఇన్నేళ్లుగా రైతుబంధు రాకపోవడం, రుణాలు అందకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. కానీ ఇన్నేళ్ల తర్వాత నాకు పట్టాదారు పాస్‌పుస్తకం రావడంతో రైతుబంధు, రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవడం ఆనందంగా ఉంది.

-సపావట్ శ్రీను, పీక్లాతండా

మా సమస్య పరిష్కరించండి



మా గ్రామంలో ఎంజాయ్‌మెంట్ సర్వే చేసిన తర్వాత మీసేవలో దరఖాస్తు చేసుకోమన్నరు. దరఖాస్తు చేసుకున్న తర్వాత నా భూమికి సంబంధించిన వివరాలు కనిపించడంలేదు. ఇలా మూడుసార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ రిజెక్ట్ అని వచ్చింది. మళ్లీ గత నవంబర్‌లో దరఖాస్తు చేసుకున్నా. భూమినే నమ్ముకొని బతుకుతున్నాం. మా సమస్యను కూడా పరిష్కరించండి.

-రమేష్, నారాయణపురం

ధరణితోనే సమస్య పరిష్కారం



ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారానే నారాయణపురం గ్రామ రైతుల సమస్యకు పరిష్కార మార్గం దొరికింది. ఈ విషయంపై కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించాం. ఆధారాలు సేకరించడం, అర్హులను గుర్తించడం మొదలైన పనులు సులభతరం అయ్యాయి. మిగిలిన రైతుల సమస్యను కూడా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

-ఫరీద్, తహసీల్దార్, కేసముద్రం

నేడు వైకుంఠ ఏకాదశి

- ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనాలకు ఏర్పాట్లు
- తెల్లవారుజామున 5గంటల నుంచే దైవ దర్శనాలు

మహబూబాబాద్ రూరల్: మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి వేడుకలను సోమవారం భక్తులు జరుపుకోనున్నారు. తెల్లవారుజాము 5గంటల నుంచే దైవ దర్శనాలు ప్రారంభం కానున్నాయి. కాగా జిల్లాలోని ఆయా ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయం, వేణుగోపాలస్వామి దేవాలయం, వేంకటేశ్వరబజార్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, పాత బజార్‌లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, అనంతాద్రి శ్రీజగన్నాథ వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు జరుగనున్నాయి.



నారుతో స్వాగతం..

నూతన సంవత్సరానికి యువ రైతులు వినూత్నంగా స్వాగతం పలికారు. నూతన సంవత్సరంలో వ్యవసాయం లాభసాటిగా మారాలని ఆకాంక్షిస్తూ మహబూబాబాద్ మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ఆదివారం 2023 ఆకారంలో నారును పేర్చి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

-సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

పాకాలకు వచ్చిన పర్యాటకులు



పాకాలలో పర్యాటకుల సందడి

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పర్యాటక ప్రాంతమైన పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పాకాల అందాలను వీక్షించి, ఆనందంగా గడిపారు.



ఉత్సాహంగా గడుపుతున్న పర్యాటకులు

కాళేశ్వరాలయంలో భక్తుల సందడి

కాళేశ్వరం: కొత్త సంవత్సరం సందర్భంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. ఆదివారం సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరం వద్ద భక్తజనం కోలాహలం నెలకొంది.

డీఎంహెచ్ఓ పూజలు

నూతన సంవత్సరం సందర్భంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని భూపాలపల్లి డీఎంహెచ్ఓ శ్రీరామ్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలుచేసి శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అర్చకులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు

మల్లన్న ఆలయానికి 41కిలోల వెండి వస్తువులు

- బహూకరించిన పర్ష సర్వేశ్వర్‌రావు యాదవ్–కౌసల్య దంపతులు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి పర్ష సర్వేశ్వర్‌రావుయాదవ్–కౌసల్య దంపతులు 41 కిలోల వెండి వస్తువులు బహూకరించారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న వారికి ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సర్వేశ్వర్‌రావు యాదవ్ కుటుంబ సభ్యులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. గర్భాలయ ముఖ ద్వారం, తలుపులకు వెండి తొడుగు నిమిత్తం 40 కిలోలు, గణపతికి కిలో వెండితో కిరీటం, హస్తాలు, తొండం చేయించినట్లు ఈఓ పేర్కొన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సుమారు రూ.50లక్షల అంచనాతో చేపట్టనున్న ఎల్లమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి సర్వేశ్వర్ రావు ముందుకు వచ్చారని, త్వరలో భూమి పూజ చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్వేశ్వర్‌రావు కూతురు–అల్లుడు వనజ–పవన్‌రాజ పాల్గొన్నారు.



గణపతికి వెండి వస్తువులు బహూకరిస్తున్న సర్వేశ్వర్‌రావు దంపతులు

అణగారిన వర్గాల పాలన రావాలి

గణపురం: దేశంలో సామాజికాభివృద్ధి జరగాలంటే రెడ్డి, వెలమల పాలన పోయి అణగారిన వర్గాల పాలన రావాలని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. విశారదన్ మహరాజ్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల పాదయాత్ర ఆదివారం గణపురం మండలంలోని చెల్పూరు, బస్వరాజుపల్లి, ధర్మరావుపేట గ్రామాల మీదుగా గణపురం మండల కేంద్రానికి చేరుకుంది. పలు గ్రామాల్లో డీఎస్పీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా రాజకీయ బానిసలుగా బతుకుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీల పాలన రావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే తాను పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో 10శాతం కూడా లేని అగ్రకుల పాలనకు చరమగీతం పాడి 90శాతం ఉన్న అట్టడుగు వర్గాల రాజ్యం స్థాపించాలన్నారు. అప్పుడే బీసీ, ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో మార్పులు కనిపిస్తాయని చెప్పారు. డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మణ్, రమేష్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.



పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహరాజ్

శిథిలం

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం

- పెచ్చులూడుతున్న స్లాబు
- ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన

మరిపెడ రూరల్: మరిపెడ మండలంలోని వీరారం బీసీకాలనీలో 2000సంవత్సరంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. ఈ కేంద్రానికి సుమారు 25మంది చిన్నారులు నిత్యం హాజరవుతుండగా.. వారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ భవనం స్లాబు పెచ్చులూడుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంగన్‌వాడీ టీచరు, పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

22ఏళ్ల క్రితం నిర్మాణం..

అంగన్‌వాడీ భవనం 22ఏళ్ల క్రితం నిర్మించారు. అది శిథిలావస్థకు చేరుకోగా.. ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. కనీసం సున్నం కూడా వేసిన దాఖలాలు లేవు. దీంతో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరి స్లాబు పెచ్చులూడుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నిర్వాహకులు, పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వర్షాకాలం భవనం మొత్తం కురుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికైనా దాతలు ముందుకు వచ్చి నిరుపేద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ భవనం మరమ్మతులు చేయించడంతో పాటు పేద పిల్లలకు సహాయ, సహకారాలు అందించాలని అంగన్‌వాడీ టీచర్, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



స్లాబు పెచ్చులూడుతున్న అంగన్‌వాడీ భవనం



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు

దాతలు సహకరించాలి




శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం మరమ్మతులు చేయించేందుకు గ్రామంలోని దాతలు ముందుకు రావాలన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రానికి హాజరయ్యే పిల్లలకు పలకలతో పాటు సహాయ, సహకారాలు అందించాలి.

- గంట కవిత, అంగన్‌వాడీ టీచర్, వీరారం

గగన 'కోట'

చారిత్రక వైభవానికి నిలువెత్తు సాక్ష్యం కాకతీయుల కళా రాజ్యం.. నగరంలోని ఖిలావరంగల్. ఓవైపు పచ్చని పంట పొలాలు.. మరోవైపు రెండు వరుసల్లో పేర్చినట్లు వృత్తాకారంలో నిర్మించిన పటిష్టమైన మట్టి, రాతి కోటలు.. వాటి పక్క నుంచి నల్లని తాచులా మెలికలు తిరుగుతూ కనువిందు చేస్తున్న అగర్త చెరువు.. ఏకశిల గుట్ట.. పక్కనే నీలిరంగులో మంచినీటి సరస్సు.. దట్టమైన అడవిని తలపించే ఏకశిల చిల్డ్రన్స్ పార్కు.. నల్లరాతికి జీవం పోసిన శిల్పకళా సంపద.. ఇవన్నీ కలగలిపిన చిత్రమే ఇది. ఇటీవల పర్యాటక శాఖ వారు హెలికాప్టర్ ద్వారా గగన తలం నుంచి తీశారు.

- ఖిలా వరంగల్



గగనం నుంచి కనువిందు చేస్తున్న కాకతీయుల రాజధాని

6, 7తేదీల్లో వర్సిటీస్ ఎంప్లాయీస్ రాష్ట్ర మహాసభలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 6, 7తేదీల్లో తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ సీఐటీయూ రాష్ట్ర రెండో మహాసభలను నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో యూనియన్ నాయకుడు ఎ.రాంచందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. యూనివర్సిటీల్లోని ఉద్యోగ, కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఈ మహాసభలు వేదికగా నిలవనున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నుంచి 250మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ కేయూ ప్రధాన కార్యదర్శి పెండ్యాల రవి, బాధ్యులు మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి, దేశిని రవి, మొగిలి రాజేందర్, సంగాల రాజు, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రమేష్

కేయూ సోషల్ సైన్స్ విభాగాల డీన్‌గా విజయబాబు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ డీన్‌గా హిస్టరీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ కె.విజయబాబు నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు సోషల్ సైన్స్ విభాగాల డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సోషియాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ పదవీకాలం పూర్తికావడంతో ఆయన స్థానంలో విజయబాబును నియమించారు. కాగా, చరిత్ర విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, గాంధీయన్ స్టడీస్ డైరెక్టర్‌గా, వసతి గృహ సంచాలకుడిగా, సుబేదారి యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయబాబు పనిచేశారు.



క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌ అపహరణ


విచారణ చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండలం మల్కాపూర్‌ గ్రామ సమీపంలో మీసుగు రాజభూపతి వ్యవసాయ బావి వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లారు. రైతు రాజభూపతి, బీఆర్‌ఎస్‌ మండల కార్యదర్శి పోలేపల్లి రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని శనివారం సాయంత్రం ఇళ్లకు వెళ్లారు. ఆదివారం ఉదయం బావుల వద్దకు వచ్చి మోటార్లు ఆన్‌చేశారు. విద్యుత్‌ రాకపోవడంతో సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజ్‌ పోయిందనుకుని వెళ్లి చూశారు. గద్దెపై ఉండాల్సిన ట్రాన్స్‌ఫార్మర్‌ కనిపించలేదు. వెంటనే ఏఈ రమేష్‌, సబ్‌ఇంజనీర్‌ వినిత్‌రెడ్డి, ఎల్‌ఐ చంద్రశేఖర్‌, జేఎల్‌ఎం రత్నాకర్‌కు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో డ్రైవర్‌ అదృశ్యం


నరేశ్‌


గీసుకొండ: గ్రేటర్‌ వరంగల్‌ 16వ డివిజన్‌ జాన్‌పాకకు చెందిన బానోత్‌ నరేశ్‌ అనే ఆటో డ్రైవర్‌ అదృశ్యమైనట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌ రాయల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్‌ కథనం ప్రకారం.. ముత్తూట్‌ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు తీసుకువస్తానని డిసెంబర్‌ 26న రూ.లక్ష తీసుకుని నరేశ్‌ ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్‌ చేస్తే స్విచాఫ్‌ వచ్చింది. దీంతో నరేశ్‌ భార్య కళ్యాణి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త కొంతకాలంగా మండికొండ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన గుగులోత్‌ కల్పన అనే మహిళతో ఫోన్‌లో మాట్లాడేవారని, ఆమెతోనే వెళ్లి ఉంటాడని ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేసింది. కళ్యాణి ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్పూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది రాజేంద్రప్రసాద్‌, యాకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండకు చెందిన ఎలకంటి సుగుణమ్మ, రాకేష్‌ రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో ఆదివారం జరిగిన విందుకు హాజరయ్యారు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్తుండగా చిన్నపెండ్యాల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై స్కూటీకి కుక్క అడ్డువచ్చింది. దీంతో అదుపు తప్పి కిందపడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

'కాళేశ్వరం' మోటార్లు రెడీ!

- ఆరింటితో రోజూ ఒక టీఎంసీ ఎత్తిపోసేందుకు ప్రణాళికలు
- లక్ష్మీలో ఆరు.. అన్నారంలో నాలుగు మోటార్లు సిద్ధం
- యాసంగికి నీరందించడమే లక్ష్యం


మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీ


లక్ష్మీ పంపుహౌస్‌లో మోటార్ల ట్రయల్‌ రన్‌

కాళేశ్వరం: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ పంపుహౌస్‌లో ఆరు మోటార్లు, పెద్దపల్లి జిల్లా అన్నారం పంపుహౌస్‌లో నాలుగు మోటార్లు నీటిని ఎత్తిపోసేందుకు రెడీ అయ్యాయి. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ యాసంగి పంటలకు నీరందించడానికి ఇంజనీరింగ్‌ అధికారులు ఈ మేరకు సిద్ధం చేసినట్లు తెలిసింది. 2022 డిసెంబర్‌ చివరినాటికి నీటిని ఎత్తిపోస్తామని ప్రభుత్వం చెప్పిన విధంగా అధికారులు ట్రయల్‌రన్‌ పూర్తి చేశారు.

రెండో టీఎంసీ ఆరు మోటార్లతోనే..

ప్రస్తుతం లక్ష్మీ పంపుహౌస్‌లో రెండో టీఎంసీకి సంబంధించిన 11 మోటార్లు, మూడో టీఎంసీకి చెందిన ఆరు మోటార్లు కలిసి మొత్తం 17 మోటార్లు ఉన్నాయి. వరదలతో నీట మునిగి రెండో టీఎంసీలో ఒకటి, మూడో టీఎంసీలో ఆరు మోటార్ల వరకు చెడిపోయాయి. వాటికి సంబంధించిన మరమ్మతులు ఇంకా మొదలు కాలేదని సమాచారం. కాగా, రెండో టీఎంసీలోని 1, 2, 3, 4, 5, 6 మోటార్లకు గత ఏడాది డిసెంబర్‌ 18 నుంచి వరుస క్రమంలో ఇంజనీరింగ్‌ అధికారులు మరమ్మతులు పూర్తి చేసి ట్రయల్‌ రన్‌ పూర్తి చేశారు. మొత్తం ఆరు మోటార్ల ట్రయల్‌రన్‌ సక్సెస్‌ కావడంతో నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. 2019 నుంచి 2022 వరకు లక్ష్మీ పంపుహౌస్‌ గుండా 127 టీఎంసీల నీటిని గ్రావిటీ కాల్వ ద్వారా అన్నారం బ్యారేజీకి తరలించిన విషయం తెలిసిందే.

రెండు బ్యారేజీల్లో బ్యాక్‌వాటర్‌..

ఎగువన గోదావరిపై అన్నారం వద్ద నిర్మించిన సరస్వతి బ్యారేజీలో మొత్తం 66 గేట్లు మూసివేసి నీటిని నిలుపుతున్నారు. బ్యారేజీ సామర్థ్యం 10.87 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే, లక్ష్మీ బ్యారేజీలో మొత్తం 85 గేట్లకుగాను ఒక గేటు ఎత్తి 84 గేట్లను మూసివేశారు. బ్యారేజీ సామర్థ్యం 16.17 టీఎంసీలకు ప్రస్తుతం 12.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదేవిధంగా లక్ష్మీ బ్యారేజీ బ్యాక్‌ వాటర్‌ కాళేశ్వరం వరకు 21 కిలోమీటర్ల మేర నిలుస్తుంది. అక్కడి నుంచి లక్ష్మీ పంపుహౌస్‌లో మోటార్లు ఎత్తిపోయగా అన్నారం బ్యారేజీకి గ్రావిటీ కాల్వ ద్వారా సరస్వతి బ్యారేజీకి జలాలు చేరుతాయి. అక్కడి నుంచి బ్యాక్‌ వాటర్‌ 32 కిలోమీటర్ల మేర నిలుస్తుంది. నీటిని ఎత్తిపోయడానికి లక్ష్మీ పంపుహౌస్‌లో ఆరు, పెద్దపల్లి జిల్లా అన్నారం పంపుహౌస్‌లో నాలుగు మోటార్లు రెడీగా ఉండగా లక్ష్మీ, అన్నారం పంపుహౌస్‌ల్లో మోటార్ల ద్వారా రోజుకు ఒక టీఎంసీని తరలించడానికి ఇంజనీరింగ్‌ అధికారులు సర్వ సిద్ధం చేశారు. రేపు లేదా ఎల్లుండి నుంచి మోటార్లు నీటిని ఎత్తిపోయనున్నాయని తెలిసింది.

ఇప్పటికీ ఆంక్షలే..

గతేడాది జూలై 14న లక్ష్మీ పంపుహౌస్‌కు భారీ వరద చేరి నీట మునిగిన విషయం తెలిసిందే. ఫోర్‌బేలోకి వరద చేరి రక్షణ గోడ కూలింది. పంపుహౌస్‌లోకి వరద చేరడంతో రెండు భారీ క్రేన్లు, ఇనుప నిచ్చెనలు, వాల్వ్స్‌, ఏడు మోటార్లు చెడిపోయాయి. ఎలక్ట్రికల్‌ పరికరాలు, ఏసీలు, ప్యానల్‌ బోర్డులు నీటిలో తేలియాడాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పంపుహౌస్‌ ప్రాంతమంతా ఆంక్షలతో పోలీసు పహారలో ఉంది. ఇప్పటికీ అక్కడి పనులన్ని రహస్యంగానే సాగుతున్నాయి.

చేపల వేటకు వెళ్తూ..

- బైక్‌ అదుపుతప్పి ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


రాజబాపు (ఫైల్‌)

కాళేశ్వరం: చేపల వేటకు వెళ్తూ బైక్‌ అదుపుతప్పి పడిపోవడంతో యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం కాళేశ్వరం పరిధి మజీద్‌పల్లి గ్రామానికి చెందిన పానెం రాజు, మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా అరుడ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజబాపు(19) అన్నారం గ్రామంలో చేపల వేటకు బయలుదేరారు. ఈ క్రమంలో గ్రావిటీ కాల్వ సమీపంలో బైక్‌ అదుపు తప్పి కిందపడిపోయారు. రాజబాపుకు తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. రాజుకు కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఇద్దరిని మహదేవపూర్‌ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజబాపు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాజు చికిత్స పొందుతున్నాడు. నూతన సంవత్సరం రోజు విషాదం చోటు చేసుకోవడంతో మృతుడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి మద్యం తాగి బైక్‌ నడపడమే కారణమని స్థానికులు పేర్కొంటున్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు


గోపాల్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

- శీతాకాలంలో రికార్డు స్థాయి విద్యుత్‌ వినియోగం
- మార్చి నాటికి 15,500 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా
- టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ ఎ.గోపాల్‌ రావు

హన్మకొండ: విద్యుత్‌ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తూ టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ ముందుకు సాగుతోందని సంస్థ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎన్పీడీసీఎల్‌ డైరెక్టర్లు, సీజీఎంలు, అధికారులు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు సీఎండీ ఎ.గోపాల్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి న్యూఇయర్‌ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ దార్శనికత, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్‌ అందిస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ సరఫరా ఆదివారంతో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు.

పెరిగిన విద్యుత్‌ డిమాండ్‌

యాసంగి ప్రారంభంలోనే విద్యుత్‌ డిమాండ్‌ 14,017 మెగావాట్లకు చేరిందని, ఈ ఏడాది మార్చి నాటికి అది 15,500 మెగావాట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నామని సీఎండీ గోపాల్‌రావు తెలిపారు. ఎంత డిమాండ్‌ ఉన్న అంతరాయం లేకుండా విద్యుత్‌ అందిస్తామనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. తొలుత ఆయన ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ బి.జనార్దన్‌, సీజీఎంలు, జీఎంలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

- ఐదుగురిపై కేసు


స్వాధీనం చేసుకున్న కోడి పుంజులతో పోలీసులు

కాళేశ్వరం: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం పలుగులలో నూతన సంవత్సరం సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో కాళేశ్వరం పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పలువురు పోలీసులను చూసి పారిపోగా, అక్కడే ఉన్న మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి ఐదు కోడి పుంజులు, రూ. 2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్‌?

కాజీపేట: హనుమకొండ హంటర్‌ రోడ్డులోని కలవ్రీ చర్చికి ప్రార్థనల నిమిత్తం వచ్చిన వ్యక్తిని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్‌ చేసిన ఘటన నగరంలో సంచలనంగా మారింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన సత్తారి కోటిలింగం భార్య రాజమ్మతో కలిసి కారులో చర్చికి వచ్చారు. అప్పటికే అక్కడ మకాం వేసిన గుర్తు తెలియని వ్యక్తులు కోటిలింగాన్ని అతడి కారులోనే బలవంతగా కిడ్నాప్‌ చేసి తీసుకెళ్లారు. బాధితుడి భార్య రాజమ్మ సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

మృతదేహంతో రాస్తారోకో



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు, మృతుడి తండ్రి, సీఐ మధ్య వాగ్వాదం

- న్యాయం చేయాలని సుమన్‌ కుటుంబసభ్యుల ఆందోళన
- సీఐతో వాగ్వాదం
- తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత

కురవి: గ్రానైట్‌ లారీ ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన బానోత్‌ సుమన్‌ కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సంఘటన మహబూబాబాద్‌ జిల్లా కురవి శివారు సోమ్లతండా సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి ఆటోను గ్రానైట్‌ లారీ ఢీకొన్న విషాదకర ఘటనలో ముగ్గురు మృతి చెందిన సంగతి తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం ముగ్గురి మృతదేహాలను మహబూబాబాద్‌ నుంచి సొంత గ్రామమైన మంగోరిగూడెంకు తీసుకెళ్లారు. అయితే, మృతుడు బానోత్‌ సుమన్‌ కుటుంబ సభ్యులకు న్యాయం చేయలేదనే కారణంతో మృతదేహాన్ని ట్రాలీ ఆటోలో సంఘటనా స్థలానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి మృతుడి భార్య, తండ్రి, ముగ్గురు కుమార్తెలు, బంధువులు రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న మహబూబాబాద్‌ టౌన్‌ సీఐ సతీష్‌ రాస్తారోకో వద్దకు చేరుకున్నారు. ఆందోళన విరమించాలని మృతుడి కుటుంబ సభ్యులను సీఐ సతీష్‌ ఒప్పించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యులకు సీఐకి తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. రాస్తారోకో విరమించేది లేదని, లారీ యజమాని, గ్రానైట్‌ ఓనర్లు వచ్చి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహించిన సీఐ మృతుడి కుటుంబ సభ్యులతో గొడవకు దిగారు. మృతుడి తండ్రి హర్జను నెట్టివేశారు. కిందపడిపోతున్న అతడిని మహిళలు పట్టుకున్నారు. వెంటనే తేరుకున్న హర్జ ఆగ్రహంతో సీఐ సతీష్‌తో గొడవకు దిగాడు. ఒకరి చేతులు మరొకరు పట్టుకునే స్థాయికి గొడవ చేరింది. దీంతో మహిళలు ఒక్కసారిగా సీఐపైకి గొడవ చేశారు. చేసేదేమి లేక సీఐ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాసేపటికి కురవి ఎస్సై బి.రాము, మరికొందరు ఎస్సైలు, మరిపెడ, డోర్నకల్‌ సీఐలు సాగర్‌, వెంకటరత్నం సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను శాంతింపజేసే యత్నం చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో తొర్రూరు డీఎస్పీ రఘు చేరుకుని రోప్‌ను తెప్పించి మృతదేహాన్ని వాహనంలోకి ఎక్కించే యత్నం చేయించారు. అయినా మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించలేదు. సుమారు గంటపాటు జరిగిన ఆందోళన అనంతరం పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులను శాంతింపజేశారు. మృతదేహాన్ని వాహనంలో మంగోరిగూడెంకు తరలించారు.

బైరి నరేశ్‌ వ్యాఖ్యలను సమర్థించిన యువకుడి అరెస్ట్‌


అగ్నితేజ అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

కమలాపూర్‌: అయ్యప్ప స్వామి, హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేశ్‌ అరెస్టును ఖండిస్తూ, ఆయన చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ సోషల్‌ మీడియాలో వివాదాస్పద పోస్ట్‌ చేసిన యువకుడిని అరెస్ట్‌ చేసినట్లు కమలాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ సంజీవ్‌ తెలిపారు. కమలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వివరాలు వెల్లడించారు. అయ్యప్పపై బైరి నరేశ్‌ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ అతడి సోదరుడి కుమారుడు హనుమకొండ జిల్లా కమలాపూర్‌ మండలం కన్నూరు గ్రామ పంచాయతీ పరిధి రాములపల్లికి చెందిన బైరి అగ్నితేజ(20) ఫేస్‌బుక్‌లో ఓ వివాదాస్పద పోస్ట్‌ పెట్టాడు. ఆ పోస్ట్‌ మరింత దుమారం రేపింది. కన్నూరుకు చెందిన జిల్లపెల్లి ఉదయ్‌కిరణ్‌ అలియాస్‌ విక్రమ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్నితేజపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి అగ్నితేజను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై సతీష్‌, సిబ్బంది కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఇలా వెళ్తే.. ఎలా?

గ్రానైట్‌ రాళ్లకు తాళ్లు కట్టకుండానే తరలిస్తున్న దృశ్యం

- నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్‌ తరలింపు
- ప్రమాదమని తెలిసి కూడా పట్టించుకోని అధికారులు

హసన్‌పర్తి: గ్రానైట్‌ రాళ్ల రవాణా నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. లారీల్లోకి గ్రానైట్‌ రాళ్లకు ఎక్కించిన తర్వాత అవి కిందపడకుండా ఉండేందుకు గొలుసులతో బంధించాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. అయితే, క్వారీ యజమానులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా, ముందు జాగ్రత్తలు పాటించకుండా భారీ రాళ్లకు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అలా తరలించడం ప్రమాదమని తెలిసి కూడా పోలీసులు, మైనింగ్‌ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలు తావిస్తోంది. ముఖ్యంగా మూల మలుపులు, స్పీడ్‌ బ్రేకర్లు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు రాళ్లు కిందికి జారే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నిబంధనలు పాటించకపోవడంతోనే మహబూబాబాద్‌లో ఘోర ప్రమాదం జరిగి ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు.

ఉచిత న్యాయసేవలు అభినందనీయం

- వర్సిటీలకు సంబంధించిన కేసులు పరిష్కరించాలి
- హైకోర్టు చీఫ్‌ జస్టిస్‌కు అకుట్‌ జనరల్‌ సెక్రటరీ లేఖ

కేయూ క్యాంపస్‌: పేదలకు ఉచిత న్యాయసేవలు చేరువచేసేలా 23 జిల్లాల్లో ఈ నెల 2 నుంచి న్యాయ సేవాధికార సంస్థలు ప్రారంభించడం అభినందనీయమని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం జనరల్‌ సెక్రటరీ డాక్టర్‌ మామిడాల ఇస్తారి అన్నారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ఉజ్జల్‌ భూయాన్‌కు రాసిన లేఖను ఆదివారం విడుదల చేశారు. ఈ నిర్ణయంతో పేదలకు ఉచిత న్యాయ సాయం అందుతుందన్నారు. అలాగే, యూనివర్సిటీలకు సంబంధించిన కేసులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంటున్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని లేఖలో కోరారు. విద్యా వ్యవస్థలో అనర్హులను అందలం ఎక్కించడం వంటి చర్యలతో బాధితులు కోర్టులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఉద్యోగులు రిటైర్డ్‌ అయ్యాక కూడా కేసులు పరిష్కారం కాకపోవడంతో బాధితులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కొన్నిసార్లు జడ్జిమెంట్‌ నెలలు రిజర్వ్‌ కావడం వల్ల తప్పుచేసిన వారు తప్పించుకునే అవకాశం కలుగుతుందన్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య


కేదారి (ఫైల్‌)

తొర్రూరు: పెళ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్‌ జిల్లా తొర్రూరు మండలం ఫత్తేపురంలో ఆదివారం తెలవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఫత్తేపురం గ్రామానికి చెందిన కొత్తగట్ల కేదారి(25) నాయీ బ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితులకు పెళ్లిళ్లు కావడం.. తనకు పెళ్లి సంబంధాలు రాకపోవడంతో వివాహం కావడం లేదని జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురై కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..


బాల్యా (ఫైల్‌)

కేసముద్రం: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం బేరువాడ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగులోత్‌ బాల్యా (45)ను కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఈ క్రమంలో భార్య శాంతితో గత ఏడాది డిసెంబర్‌ 31న గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన బాల్యా పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మనస్తాపంతో ఒకరు..

మడికొండ: మనస్తాపంతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాజీపేట మండలం కడిపికొండలో జరిగింది. మడికొండ పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన నెల్లి రాకేష్‌(32)కు భార్యతో వారం రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన అతడు శనివారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు ఆదివారం గమనించి మృతుడి అక్క సకెళ్ల రాజేశ్వరికి సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు.

రైతు అనుమానాస్పద మృతి


రమణ (ఫైల్‌)

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భూవివాదంపై సదరు రైతుకు వ్యతిరేకంగా తీర్మానం చేయడం వల్లే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే, పంచాయితీ పెద్దలు ఆత్మహత్య బయటకు రాకుండా కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలిలా ఉన్నాయి. పెగడపల్లికి చెందిన చల్లా రమణ(35)ను కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీనికితోడు భార్య కాపురానికి రాకపోవడంతో మరింత కుంగిపోయ్యాడు. రమణకు సంబంధించిన భూమిపై వివాదం నెలకొనగా ఆదివారం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే, పంచాయితీలో పెద్ద మనుషులు తనకు వ్యతిరేకంగా తీర్మానం చేశారని రమణ మిత్రుల వద్ద ప్రస్తావించి బోరున విలపించినట్లు తెలిసింది. వ్యవసాయ భూమి లేకుండా పోవడం, భార్య కాపురానికి రాకపోవడంతో మనోవేదనకు గురైన రమణ ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేయూ ఇన్‌స్పెక్టర్‌ దయాకర్‌ తెలిపారు. చల్లా రమణ మృతిపై విచారణ చేపడుతామని వివరించారు. పెద్ద మనుషులు అన్యాయంగా తీర్మానం చేసినట్లు తేలితే కేసు నమోదు చేస్తామన్నారు.